# ప్రభుత్వ హామీల కమిటీ

## (రూల్ 267 & 268)

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం శాసనసభకు బాధ్యత వహిస్తుంది. అది శాసనసభ నియంత్రణ, అజమాయిషీలో ఉంటుంది. శాసనసభ కార్యనిర్వాహకవర్గంపై నియంత్రణ వహించటానికి సభా కమిటీలు ఉపకరిస్తాయి. అంటే సభా కమిటీల ద్వారా శాసనసభ ఈ విధిని నిర్వహిస్తుంది.

శాసనసభ అన్ని విషయాలను సవివరంగాను, సంపూర్ణంగాను పరిశీలించజాలదు. సమయం పరిమితంగా ఉంటుంది. సాంకేతిక, విశేష పరిజ్ఞానం కొన్ని విషయాల్లో అవసరం కనుక, సభ తన కమిటీల ద్వారా విషయాలను కూలంకషంగా పరిశీలింపజేస్తుంది. తద్వారా సభ కార్యనిర్వాహక వర్గంపై నియంత్రణ వహిస్తుంది. ప్రభుత్వ హామీల కమిటీ అట్టి విధులను నిర్వహించే కమిటీలలో ఒకటి. ప్రభుత్వ హామీల కమిటీ భారతదేశంలోనే ఉద్భవించింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రధానంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి బ్రిటన్ మాతృక. అయితే బ్రిటన్లో హామీల కమిటీ లేదు. ఈ హామీల కమిటీ అత్యంత శక్తివంతమైనది. దీని అధికార పరిధికి అవధులు లేవు. సభాసమక్షంలో ప్రధానంగా ఆర్థిక, సాంఘిక అంశాలన్నిటికి, ఆ విషయాలపై మంత్రి హామీ యిచ్చినట్లయితే, హామీల కమిటీ అధికారం విస్తరిస్తుంది.

### కమిటీ ఏర్పాటు : (రూల్ 268)

కమిటీలో సభాపతి నామ నిర్దేశము చేసిన సభ్యులు ఏడుమందికి మించకుండా ఉండవలెను. మంత్రి కమిటీ సభ్యునిగా ఉండరాదు. కమిటీ సభ్యుడుగా మంత్రిని నామనిర్దేశాన్ని చేయరాదు. ఒక సభ్యుడు తాను ఆ కమిటీలో సభ్యునిగా నియమితమైన తర్వాత మంత్రిగా నియమితమైన యెడల, అట్టి నియామకపు తేదీ నుంచి ఆయన కమిటీ సభ్యత్వాన్ని కోల్పోతాడు.

### అధ్యక్షుని నియామకం:

ఏడుగురు సభ్యులకు మించని విధంగా కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. సభాపతి ప్రభుత్వ హామీల కమిటీ సభ్యులలో ఒకరిని అధ్యక్షులుగా నియమిస్తారు.

### పదవీ కాలం :

సభాపతి నిర్దిష్టపరచినంతకాలం ఈ కమిటీ సభ్యులు పదవిలో ఉంటారు. సభాపతి ఆ విధంగా కాలాన్ని నిర్దిష్టపర్చని యెడల, కొత్త కమిటీని ఏర్పాటు చేసేటంతవరకు వారు కమిటీ సభ్యులుగా ఉంటారు.

### కమిటీ విధులు : (రూల్ 267)

మంత్రులు శాసనసభలో ఆయా సమయాల్లో యిచ్చిన హామీలను, వాగ్దానాలను, పూచీలు మున్నగు వాటిని పరిశీలించి ఆ హామీలు, వాగ్దానాలను ఏ మేరకు అమలు జరిపింది

నివేదించటం, వాటిని అమలు జరిపినట్లయితే ఆ సందర్భంలో అందుకు అవసరమైన కనీస కాలంలో వాటిని అమలు జరిపారా లేదా అన్న విషయాలను గూర్చి హామీల కమిటీ నివేదిస్తుంది.

**నివేదిక సమర్పణ :**

హామీల కమిటీ ఆయా సమయాల్లో నివేదికలను తయారుచేసి సభకు సమర్పిస్తుంది. సభకు నివేదికను సమర్పించిన తర్వాత, నివేదిక ప్రతిని సంబంధిత ప్రభుత్వ శాఖకు పంపుతారు. ప్రభుత్వ శాఖ ఆ కమిటీ సిఫార్సులపై చర్యలు తీసుకోవాలి. వాటిని అమలు జరపాలి. సిఫార్సులను అమలు జరిపి ప్రభుత్వ శాఖలు తమ సమాధానాలను హామీల కమిటీకి నివేదిస్తాయి. హామీల కమిటీ వాటిని పరిశీలించి సభకు నివేదికను సమర్పిస్తుంది.

**హామీలపై అమలు నివేదికలు :**

సభలో మంత్రులు చేసిన హామీలు, వాగ్దానాలపై అమలు నివేదికలను సభా సమక్షంలో పెట్టేందుకుగాను హామీల సమాచారాన్ని తెలిపిన తేదీ నుండి అరవై రోజులలోగా శాసనమండలి సచివాలయానికి సమర్పించాలి.



# 17

## ఆంధ్రప్రదేశ్
## శాసన సభ కార్య విధానం
## సంపుటి

## ప్రభుత్వ హామీల కమిటీ




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.